ఆంధ్రజ్యోతి

andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 : కనిష్ఠం 23.2




ఆదిలాబాద్ జిల్లా వార్తలు

3

సోమవారం 16 సెప్టెంబరు 2024



● సాలెగూడ పాఠశాలలో ఉన్న విద్యార్థులు





అయోమయంలో.. గిరిజన విద్య!

- సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలు
- పొలాల అమావాస్య, పండుగల కోసమని ఇంటికి వెళ్లిన విద్యార్థులు
- ఇప్పటికీ పాఠశాలలకు చేరుకోని వైనం
- పడిపోతున్న హాజరు శాతం
- విద్యార్థుల కోసం టీచర్ల ఇంటి బాట
- అవ్వల్ కమిటీలను పునరుద్ధరించాలి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 200 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వేలాది మంది గిరిజన విద్యార్థులు

ఉట్నూర్, సెప్టెంబరు 15: ఉమ్మడి జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పడిపోవడంతో గిరిజన విద్య అయోమయంలో పడింది. ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు తమ ఆదివాసీ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు పెద్దపీట వేయడంతో పాటు పండుగలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. దీంతో ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులను తల్లిదండ్రులు పండుగలకు పబ్బాలకు తీసుకెళ్లి.. పండుగ అయిన రెండు, మూడు రోజుల్లోనే తిరిగి పాఠశాలలకు పంపంచే బదులు అన్ని పండుగల కోసం విద్యార్థులను ఇళ్ల వద్దనే ఉంచుకోవడం వల్ల గిరిజన విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 200కు పైగా పాఠశాలల్లో పని చేస్తుండగా.. వేలాది మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. అంతేకాకుండా ఒక్క ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూర్, బోథ్ ఏటీడీవోల పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు 54 పని చేస్తున్నాయి. 22వేల 252 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు.

పండుగలకు వెళ్లిన విద్యార్థులు

భాద్రపద మాసంలో వచ్చిన తొలి పండుగ పొలాల అమావాస్య పండుగను ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు. దీంతో తమ పిల్లలను పాఠశాలల నుంచి ఇళ్లకు పంపించాలని కోరుతూ పండుగకు ఒక రోజు ముందుగానే ఆయా పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు చేరుకొని తమ పిల్లలను పంపించాలని నిర్వాహకులను కోరారు. పొలాల అమావాస్య పండుగకు సెలవు లేదని, పేర్కొన్న నిర్వాహకులతో ఆయా పాఠశాలల వద్ద తల్లిదండ్రులు వాదోపవాదాలకు దిగారు. దీంతో ఐటీడీఏ ఉన్నతాధికారులకు సమాచారం అందించి.. తల్లిదండ్రుల తో కాగితాలు రాయించుకుని పండుగ కాగానే తిరిగి పాఠశాలలకు విద్యార్థులను తెచ్చి వెళ్లాల ని పొలాల పండుగకు పంపించినా.. పిల్లలు ఇప్పటికీ చాలా మంది పాఠశాలలకు చేరుకోలేదు. దీంతో పాఠశాలలో గైర్హాజరు శాతం పెరిగి పోయింది.



పెరగని హాజరు శాతం

ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్, ఉట్నూర్ సహాయ గిరిజన సంక్షేమ అధికారుల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగడం లేదు. ఆదిలాబాద్ ఏటీడీవో పరిధిలో 14 ఆశ్రమ పాఠశాలలు ఉండగా 3514 మంది విద్యార్థుల చదువుకుంటున్నారు. పొలాల పండుగకు వెళ్లిన విద్యార్థులు కొందరు కొందరు వస్తుండగా.. 1714 మంది విద్యార్థులు నిన్నటి వరకు పాఠశాలలకు చేరుకోగా.. 1800 వందల మంది విద్యార్థులు పాఠశాలలకు ఇంకా హాజరు కావడం లేదు. బోథ్ ఏటీడీవో పరిధిలో 14 ఆశ్రమ పాఠశాలలో 4064 మంది విద్యార్థులకు గాను 2588 మంది మాత్రమే హాజరు అవుతుండగా.. 1476 మంది విద్యార్థులు అబ్సెంట్ అవుతున్నారు. ఉట్నూర్ ఏటీడీవో పరిధిలో 26 ఆశ్రమ పాఠశాలలో ఉండగా.. 14678 మంది విద్యార్థులకు గాను 7742 మంది విద్యార్థులు హాజరు అవుతుండగా.. 6936 మంది విద్యార్థులు అబ్సెంట్ అవుతున్నారు.

టీచర్ల ఇంటిబాట

పొలాల అమావాస్య పండుగకు వెళ్లిన గిరిజన విద్యార్థులు వినాయక చవితి ఉత్సవాలు పూర్తి అయ్యే వరకు పాఠశాలలకు దూరంగా ఉంటున్నారని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు సముదాయించాలని, అంతేకాకుండా విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. అధికారులు చెప్పక ముందే అక్కడక్క ఉపాధ్యాయులు గ్రామాలకు వెళ్లి తల్లిదండ్రులను విద్యార్థులను పాఠశాలలకు పంపించాలని కోరుతున్నారు.

అవ్వల్ కమిటీలతోనే ప్రయోజనం

గతంలో ఐటీడీఏ పరిధిలోని గ్రామాలలో అవ్వల్ కమిటీల ద్వారా పాఠశాలల విద్యార్థులు హాజరు శాతం మెరుగు పరచడానికి కృషి చేశారు. పాఠశాలలకు విద్యార్థులు, ఉపాధ్యాయుల సైతం సక్రమంగా హాజరు అవుతున్నారా? లేదా? అన్న విషయాలను అవ్వల్ కమిటీలు తెలుసుకొని ఉన్నతాధికారులకు సమాచారం అందించే వారు. అదేవిధంగా ఐటీడీఏ అధికారులు పాత విధానాలను పునరుద్ధరించి అవ్వల్ కమిటీల ద్వారా పాఠశాలల విద్యార్థుల హాజరు శాతం మరింత మెరుగు పరచడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరిచేలా చర్యలు

: జాదవ్ వసంత్‌రావు, ఇన్‌చార్జి డీడీ, ఉట్నూర్



జిల్లాలోని 54 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 22వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పొలాల అమావాస్య పండుగకు వెళ్లిన గిరిజన విద్యార్థులు ఇంకా పాఠశాలలకు సక్రమంగా హాజరు కావడం లేదు. దీంతో విద్యార్థుల హాజరు శాతం మెరుగు పరచడానికి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను గ్రామాలకు పంపించి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోనున్నాం.

సంక్షిప్త సమాచారం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి కల్నల్ వికాస్ శర్మ

ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం

ఆదిలాబాద్, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్‌సీసీ సీఏటీసీ-7 శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాకు చెందిన 600మంది కెడెట్లు ఈ శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ వికాస్ శర్మ మాట్లాడుతూ ఈనెల 23 వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు, సైనికులకు ఇచ్చే తరహాలో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో సుబేదార్ మేజర్ భగీరథ, ఏఎన్‌వోలు జగ్రామ్, అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సాయినాథ్, వినోద్, కేర్ టేకర్లు ఉమేష్ కుమార్‌పాల్, నరేందర్, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 15: ఈనెల 17న గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలో శోభాయాత్ర ప్రారంభమైన తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. వినాయక్ చౌక్, దేవిచంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్, శివాజీ చౌక్ ప్రదేశాలతో పాటు పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటుందన్నారు. భారీ వాహనాలు, ఫోర్ వీలర్స్‌కు అనుమతి లేదని, వాహనదారులు అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం : మాజీ ఎమ్మెల్యే

ఆదిలాబాద్, సెప్టెంబరు 15: దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్ అండ్ ఎల్టీపీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ డేను ఆదిలాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఇంజనీర్ వృత్తికే ఎనలేని కీర్తిని తెచ్చిన విశ్వేశ్వరయ్య సేవలు మరువలేని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్, అసోసియేషన్ అధ్యక్షుడు జగదీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

బోథ్, సెప్టెంబరు 15: బోథ్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ బడిలో చదువు జీవితానికి బాటలు వేస్తుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రత్యేకశ్రద్ధతో అభ్యసించాలని, పాఠశాలలో ఉన్న సమస్యల విషయమై అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఏపీఎం మాధవ్, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, పాఠశాల సిబ్బంది పోశెట్టి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం

శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోలీసు, విద్యుత్, పంచాయతీ అధికారులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్



దేవాపూర్‌లో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ..

ఉట్నూర్, సెప్టెంబరు 15: ఉట్నూర్ పట్టణంలో సోమవారం జరుగనున్న వినాయక నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులు, విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకుపలు సూచనలు చేశారు. వినాయక నిమజ్జన శోభాయాత్రలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా గట్టి బందోబస్తు నిర్వహించాలని అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ప్రజలకు విద్యుత్ తీగలు తగలకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల వద్ద హైమస్ట్ విద్యుత్ దీపాలు అమర్చాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సైతం జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందులో డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు శంకర్, తదితరులు పాల్గొన్నారు

● సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్ కార్యక్రమం

ఉట్నూర్: ఖానాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకొని ఆ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఫోన్ ఇన్ కార్యక్రమం. ఈ సందర్భంగా ఉట్నూర్, జన్నారం, కడెం, పెంబి, ఇంద్రవెల్లి తదితర మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు, వంతెనలు, పాఠశాలల ప్రహరీ గోడలు, తాగునీరు, గ్యాస్ సబ్సిడీ, బోర్‌వెల్లు, సీఎంఆర్‌ఎఫ్, ఉపకార వేతనాలు, ఆర్థిక చేయూత, ఐటీడీఏ పరిధిలోని సమస్యలను పరిశీలించాలంటూ ఫోన్‌ఇన్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పేర్కొన్నారు.

● గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవాపూర్, పిప్రి, చీలాటిగూడ, దన్నోరా (బి), గౌరపూర్, తేజాపూర్, సాలిగూడ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులతో అడిగి తెలుసుకున్నారు. ముందుగా సంప్రదాయబద్దంగా డోలు వాయిద్యాల మధ్య ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పెన్నిదని, ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. గ్రామాలోల నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం అనేక ప్రతిష్మాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సాంకేతిక లోపాలతో రైతు రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని, త్వరలో ప్రతి ఒక్కరికి రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహర్, జిల్లా నాయకులు సోన్ కాంబ్లే జితేందర్, సోమోరే నాగోరావు, దేవాపూర్ గ్రామ పటేల్, ఆడ మాణిక్‌రావు, దేవరి ఆడ జలపతి, మాజీ సర్పంచ్ జాకు, గ్రామస్థులు పూర్క హనుమంతు, పూసం రాజేష్, కొడప భీంరావు, మాక్కు, దేవురావు, తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఇంద్రవెల్లి: ఇటీవల అడవి పంది దాడిలో మృతి చెందిన సిర్సట్ హనుమాన్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని మెండపల్లి గ్రామానికి వెళ్లి సిర్సట్ హనుమాన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఎంపీ, ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు



ఉట్నూర్, సెప్టెంబరు 15: జైనూర్ మండలానికి వెళ్తున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లను ఉట్నూర్ పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం మండలంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్ వద్ద జైనూర్ వెళ్లకుండా ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జైనూర్ సంఘటనలో బాదితులను పరామర్శించడానికి వీలు లేకుండా పోలీసులు అడ్డుకోవడం సరైనది కాదన్నారు. వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లింగోజీ తండా ఎక్స్‌రోడ్ వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్న పోలీసులు



మాట్లాడుతున్న మల్టీ జోన్ వన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి

నిమజ్జనం రూట్ మ్యాప్ పరిశీలన

ఆదిలాబాద్, సెప్టెంబరు 15: ఆదిలాబాద్ పట్టణంలో గణపతి నిమజ్జనం రూట్ మ్యాప్‌ను ఆదివారం మల్టీ జోన్ వన్ ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం వన్ టౌన్‌లో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి డీఎస్పీ, సీఐలకు గణపతి నిమజ్జనం సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తమై అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● శాంతియుతంగా నిమజ్జనం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: వినాయక నిమజ్జనోత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని జిల్లా పోలీసులతో అంజీ చౌరస్తా నుంచి స్థానిక పోలీసు స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జరిగే వినాయక నిమజ్జనాలను శాంతియుతంగా, భక్తి శ్రద్దలతో నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా, ఘర్షణ వాతావరణానికి చోటు ఇవ్వకుండా సంబరంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, ఎస్సై చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.



ఇంద్రవెల్లిలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు



వేలాది ఎకరాలు పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులదే

● సీపీఐ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి

బోథ్, సెప్టెంబరు 15: తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశంలో మర్చిపోలేని ఘట్టమని అప్పటి పోరాటం ద్వారా వేలాది మందికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పేదలకు భూములు పంచడం జరిగిందని సీపీఐ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్ పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన కమ్యూనిస్టు యోధులకు ఆదివారం అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నినాదాలు చేశారు. 1946లో ప్రారంభమైన పోరాటం 1951 అక్టోబర్ వరకు ఐదేళ్ల పాటు కొనసాగిందన్నారు. సాయుధ పోరాటంలో 6000 మంది అమరులయ్యారని పేర్కొన్నారు. భూ స్వాములైన జాకీర్దారులకు, దేశ్‌ముఖ్‌లకు దేశ్‌పాండేలకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగిందన్నారు. వ్యవసాయ కూలీల ధరలు, పంట రుణాల మాఫీ చిన్న, సన్న కారు రైతులు పండించిన పంట భూ స్వాముల వశం కాకుండా కమ్యూనిస్టులు పోరాడారన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు

చికిత్స పొందుతూ తండ్రి మృతి

ఉట్నూర్, సెప్టెంబరు 15: తనయుడి దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తండ్రిమృతి చెందిన ఘటన ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడెంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని రాజన్నగూడెంలో ఆస్తి పంపకం కోసం అనేకసార్లు తండ్రి భూమన్నపై కుమారుడు భాగ్యవాన్ దాడి చేస్తూ వస్తున్నాడని, గతంలో నెల క్రితం కూడా ఆస్తి పంపకం కోసం తండ్రిపై దాడి చేయగా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని పోలీసులు తెలిపారు. గత మూడు రోజుల క్రితం కూడా తండ్రి భూమన్న(65)పై కొడుకు భాగ్యవాన్ ఇనుపరాడ్‌తో ముఖంపై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో తీవ్ర గాయాల పాలైన తండ్రి భూమన్నను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా అక్కడ వైద్యం అందుకుంటూ ఆదివారం మృతి చెందినట్లు ఉట్నూర్ ఎస్సై తెలిపారు. తండ్రిని కొట్టిన నేరంపై కుమారుడు భాగ్యవాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోహర్ తెలిపారు.


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం 2005-06వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ కలుసుకుని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు కౌసల్య, సత్యనారాయణ, మాయకర్, లచ్చిరెడ్డి, గోపగానీ రవీందర్, జగన్‌మోహన్, శంకర్, చంద్రశేఖర్, శ్యామ్‌కుమార్, వీరయ్య, ధనుంజయ్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.





















మత్తు విముక్తికి
డీ- అడిక్షన్ సెంటర్ చేయూత

● ఆరు బెడ్లతో ఏర్పాటు ● ప్రత్యేక సైకియాట్రిక్ వైద్యుల నియామకం
● మత్తు మందులు, మాదక ద్రవ్యాలను వినియోగించే వారికి ఇక విముక్తి
● నిర్మల్ జిల్లాలో భారీగా గంజాయి బానిసలు



ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రి, నిర్మల్

నిర్మల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాల బారిన పడి తీవ్ర రుగ్మతలకు, సమాజంలో చిన్నచూపుకు గురవుతున్న విద్యార్థులు, యువతకు అధికారులు అండగా నిలుస్తున్నారు. అలాంటి వారికి ఖరీదైన వైద్యం అందించడంతోపాటు మద్యం, మాదక ద్రవ్యాల బానిసలుగా మారిన వారిని తిరిగి సామాన్య వ్యక్తులు తీర్చిదిద్దడం, వారికి భవిష్యత్తుపై భరోసాను అందించే దిశగా జిల్లా కేంద్రంలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుచేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. దీర్ఘకాలం పాటు గంజాయి సహా ఇతర మత్తు మందులు, మద్యం, మాదక ద్రవ్యాలు వినియోగించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడంతోపాటు సమాజ జీవనానికి దూరంగా ఉంటున్న విద్యార్థులు, యువతకు ఈసెంటర్లు బంగారు భవిష్యత్తును చూపే దిశగా ఈ కేంద్రం పని చేయనుంది.

తొలిసారి నిర్మల్‌లో ఏర్పాటు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నిర్మల్ జిల్లాకేంద్రంలో తొలిసారి ఈ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు స్థానిక కలెక్టర్ అభిలాష అభినవ్ చొరవ తీసుకొని డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభించారు. మద్యానికి, మత్తుపదార్థాలకు బానిసైన వారికి అత్యుత్తమ వైద్య సేవలందించేందుకు డీ- అడిక్షన్ సెంటర్ ఎంతగానో మేలు చేస్తుందని బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లాకేంద్ర ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసైన వారిని డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించడం వల్ల వారిని మత్తు పదార్థాల నుంచి పూర్తిగా దూరం చేయ వచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ఆరు పడకలతో ఏర్పాటు

ఈ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఆరు పడకలతోపాటు అన్నిరకాల వసతులతో ఏర్పాటుచేశారు. మానసిక వైద్య నిపుణులు, మాదకద్రవ్యాలను అలవాటును మాన్పించే నిపుణులైన వారిని నియమించారు. వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ మత్తు పదార్థాల అలవాటును దూరం చేసేందుకు తోడ్పడుతుందని డాక్టర్లు చెబుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు బానిసైన వారిని ఇక్కడ చేర్పించేందుకు రెవెన్యూ, వైద్య, పోలీసు శాఖల సహకారంతో బాధితులను డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు తమ సమీపంలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసైన వారు ఉంటే అడిక్షన్ సెంటర్‌లో చేర్పించాలని, మత్తుపదార్థాల నుంచి విముక్తి పొందవచ్చని వారికి ఉచితంగా వైద్యసేవలు, కౌన్సిలింగ్ అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అభిలాష కోరారు.

భారీగా గంజాయి బానిసలు

జిల్లాలో గంజాయికి బానిసై అనేకమంది విద్యార్థులు, యువత తీవ్ర మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు. మహారాష్ట్రతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో గుట్టుగా గంజాయి సాగు చేస్తున్న వారు గంజాయిని పొడి రూపంలో రహస్యంగా నిర్మల్ జిల్లాకు తెచ్చి అమ్ముతున్నారు. ఇటీవల కాలంలో గంజాయి వినియోగం గ్రామీణ ప్రాంతాలకు సైతం విపరీతంగా విస్తరించింది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాకేంద్రంలో గంజాయి అలవాటు వందల మందికి పైగా ఉన్నట్టు చెబుతున్నారు. కొన్ని ప్రతీ కేంద్రాలను స్థావరాలుగా చేసుకొని అక్కడే మత్తుకు అలవాటు పడుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో 10కి పైగానే ఉన్నట్లు చెబుతున్నారు. అనేక సందర్భాల్లో పోలీసులు గంజాయి తాగే వారిని పట్టుకుని కేసులు సైతం పెట్టారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపి కేసు నమోదు చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే తాజాగా ప్రభుత్వం డ్రగ్స్ నిరోధం దిశగా అనేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ మత్తువిముక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడంపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఉచితంగా వైద్యం అందజేస్తాం

● డా.సునీల్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా కేంద్రాసుపత్రి

జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు నిర్మల్ జిల్లా కేంద్ర దవాఖానలో మత్తు విముక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఇక్కడ కుటుంబ సభ్యులు కానీ పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ మత్తుకు బానిసలైన వారిని తీసుకువచ్చి కేంద్రంలో చేరిస్తే వారికి ఉచితంగా వైద్యం, కౌన్సిలింగ్ ఇస్తాం.

బాధితులకు మంచిది

● డా. అల్లాడి సురేష్, సైకియాట్రిస్ట్, జిల్లా కేంద్ర ఆసుపత్రి

మత్తుకు, ముఖ్యంగా గంజాయికి అలవాటు పడ్డవారి జీవన శైలిలో మార్పు తీసుకువచ్చేందుకు మత్తువిముక్తి కేంద్రాలు సంపూర్ణంగా ఉపయోగపడతాయి. విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల బారినపడి పెడదోవ పట్టిన వారి కోసం మంచి పరిణామంగా మారుతుంది. వైద్యంతోపాటు చక్కని కౌన్సిలింగ్ ఇచ్చి వారిని సామాన్య పౌరులుగా మారుస్తాం.


ఉట్నూర్‌లోని ఆర్టీసీ డిపో

ఉట్నూర్ డిపోకు సిబ్బంది కొరత

ఉట్నూర్, సెప్టెంబరు 15: దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఉట్నూర్ ఆర్టీసీ డిపోకు కావాల్సిన సిబ్బందిని నియమించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా పని చేస్తున్న సిబ్బందికి అదనపు డ్యూటీలు వేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఉట్నూర్ డిపోకు రోజుకు రూ.7లక్షలకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ చాలీచాలని సిబ్బందితో అధికారులు నెట్టుకొస్తున్నారు. ఆదిలాబాద్ డిపో మేనేజర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఉన్నతాధికారులు సరిపెట్టుకున్నారు. ఉట్నూర్ డిపోకు రెగ్యులర్ డీఎం లేకపోవడంతో డిపో అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన ప్రణాళికలు కూడా అమలు కావడం లేదు. గతంలో ఆర్టీసీ డిపోకు రెగ్యులర్ డీఎంలో ఉన్న సమయంలో ఉట్నూర్ డిపోలో 42 సర్వీసులు ఉండేవి. కావాల్సిన సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం ఆర్టీసీ డిపోలో మొత్తం 32 మాత్రమే సర్వీసులు ఉండగా ఇందులో 16 అద్దె బస్సులు ఉన్నాయి. ఆరు లగ్జరీలు ఉండగా 10 ఆర్డినరీ సర్వీసులు ఉన్నాయి. డిపో నిర్వహణ కోసం ఏడుగురు కంట్రోలర్లు ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు టీఐ 3 పోస్టు, ఒక ఏడీసీ, ఒక డీసీ మాత్రమే ఉన్నారు. డిపోలో 9మంది డ్రైవర్లు, 9మంది కండక్టర్లు ఖాళీలు ఉండడంతో ఉన్న సిబ్బందికి అదనపు విధులు కేటాయిస్తుండడంతో ఇబ్బందులు అవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. లగ్జరీ సర్వీసులకు మాత్రం ఉన్న డ్రైవర్లే విధులు నిర్వహిస్తూ వారికే డబుల్ డ్యూటీలు వేస్తుండడంతో డ్రైవర్‌లకు నిద్ర సరిపోకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని పరిశీలకులు అంటున్నారు. ఇటీవల ఆర్టీసీ ఉన్నతాధికారులు అదనపు విధులు నిర్వహించే డ్రైవర్లకు అదనంగా రూ.వెయ్యి ఇస్తామని ప్రకటించడంతో కష్టమైనప్పటికీ కొందరుడ్రైవర్లు ఇష్టంగా పనిచేస్తున్నారు. దీంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో హైదరాబాద్ బస్సుకు ఇద్దరేసి డ్రైవర్లను నియమించిన ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం ఒక డ్రైవర్‌కి టిమ్స్ కేటాయించి నడిపిస్తున్నారు. అంతటితో ఆగకుండా వారికి బోనస్ ఆశ చూపెడుతూ ఉన్న డ్రైవర్లతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉట్నూర్ డిపోకు సిబ్బందిని వెంటనే నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

● కొత్త ఎక్స్‌ప్రెస్‌లు ఇతర డిపోలకు..

ప్రభుత్వం గత రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్సులను అన్ని డిపోలకు పంపించగా ఉట్నూర్ డిపో సైతం 2 ఎక్స్‌ప్రెస్ బస్సులను పంపించారు. అయితే ఉట్నూర్ డిపోలు ఎక్స్‌ప్రెస్ బస్సులు అవసరం లేదని భావించిన ఉన్నతాధికారులు.. రెండు బస్సులను ఒకటి ఆదిలాబాద్‌కు, మరొకటి ఆసిఫాబాద్ డిపోలకు కేటాయించారు. రెండు కొత్త బస్సులు వచ్చాయని భావించిన అధికారులు సిబ్బంది సైతం ఒకటి కరీంనగర్‌కు, మరొకటి మంచిర్యాలకు నడిపించడం ద్వారా రోజుకు రూ.45వేల వరకు కలెక్షన్ వచ్చింది. అయినప్పటికీ ఉన్నతాధికారులు రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను తరలించినప్పటికీ ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు నోరు విప్పకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ.. ఉట్నూర్ డిపోపై శీతకన్ను వేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు స్పందించాలని, ఉట్నూర్ డిపో అభివృద్ధి కోసం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోథ్ కోర్టు పీపీని సన్మానించిన గ్రామస్థులు

బోథ్, సెప్టెంబరు15: ఇటీవల బోథ్ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితమైన పంద్రం శంకర్‌ను ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఇటీవల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో పాట్నాపూర్ ఆదివాసీలు తమ గ్రామస్థుడిని ఘనంగా సన్మానించారు.

'రైతాంగ పోరాటాలు కొనసాగిద్దాం'

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు15: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు కొనసాగిద్దామని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రాజన్న పిలుపునిచ్చారు. ఆదివారం భగత్‌సింగ్ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించి రాజన్న మాట్లాడుతూ సెప్టెంబరు17 ముమ్మాటికీ విద్రోహ దినమని విలీన, విమోచన దినంకాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ సాయుధ సమరంగా రైతాంగ పోరాటం 1946 నుండి 1951 వరకు కొనసాగిందన్నారు. రైతాంగ సాయుధ పోరాట మట్టి మనుషుల పోరాటమన్నారు. కౌలు రైతులకు హక్కులు కల్పించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ, నాయత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయన్నారు. సాయన్న, కిషన్, ఆనంద్, లక్ష్మణ్, వర్మ, ప్రభాకర్ ఉన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం

ఖానాపూర్, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని పలు గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నమే ఆయా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. పట్టణ శివారు లోని గోదావరి నదిలో వినాయకుడిని నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇప్పటివరకు పోలీసులు చేసిన కృషికి స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో సంఘంనాయకులు సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రిలను సన్మానించారు.


వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

ముథోల్‌లో..

ముథోల్: మండలంలోని బోరిగాం, వడ్తాల్, బ్రహ్మన్‌గాం, గన్నోర, న్యూ ముద్గల్ గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ప్రత్యేక వాహనంలో వినాయకుడిని ప్రతిష్ఠించి గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తి పాటలు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సమితి సభ్యులు


అన్నదానంలో పాల్గొన్న మైనార్టీ యువకులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బోథ్, సెప్టెంబరు 15: సోనాల మండల కేంద్రంలో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక ప్రశ్నావళితో కూడిన పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగిందని జాగారం సమితి వారు పేర్కొన్నారు.

● అన్నదానంలో పాల్గొన్న ముస్లిం సోదరులు

బోథ్: మండల కేంద్రంలోని కొత్తగల్లీలోని శివశక్తి గణేష్ మండలి వద్ద ముస్లిం యువకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యులు షేక్ షాకీర్, గణేష్ మండపం వద్ద కాలనీ వాసులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా నిర్వహించిన కార్యక్రమంలో కాలనీ యువకులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్ల సాధన కోసం కృషి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 15: రిజర్వేషన్ల సాధన కోసం కార్యక్రమాలు చేపడుతున్నామని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి అన్నారు. రిజర్వేషన్లు వస్తే విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రెడ్డి సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులు సాధించిన వారికి, ఆయా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న రెడ్డి కులస్తులను అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డితో కలిసి సన్మానించారు.

మాల సంక్షేమ సంఘ మండల కమిటీ ఇదే..

గుడిహత్నూర్, సెప్టెంబరు 15: మాల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జక్కుల లింగన్న, ప్రధాన కార్యదర్శిగా కామెల్లి ఆశన్న, ఆర్థిక కార్యదర్శిగా మామిడిపల్లి విజయ్, ఉపాధ్యక్షుడిగా దోనిపెల్లి స్వామి, సంయుక్త కార్యదర్శిగా మెట్టు అవినాష్, కార్యదర్శులుగా ఉడుగు లోకేష్, వెంకటేష్, మహిళా ఉపాధ్యక్షుడు కాడే శ్రీలత, కార్యదర్శిగా ఎస్.అనసూయ, కార్యనిర్వాహణ కార్యదర్శి లోక నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా మాల సంక్షేమ సంఘం ఎన్నికల కమిటీ కన్వీనర్ బొంకటి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అర్ష రమేష్, కొప్పుల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ ప్రతిమల నిమజ్జనం

● పలుచోట్ల ముగిసిన వినాయక ఉత్సవాలు


తలమడుగులో వాగు వద్ద గణేష్ నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం

తలమడుగు, సెప్టెంబరు 15: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని తొమ్మిది రోజులుగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఆది దేవుడైన వినాయకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా పండుగను జరుపుకున్నారు. అదేవిధంగా శనివారం రాత్రి నుంచి గణేష్ నిమజ్జన ఉత్సవాలను యువకులు నిర్వహన కమిటీ సభ్యులు భాజాభజంత్రీలతో, డప్పుల చప్పుళ్లతో డీజే సౌండ్స్‌తో ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గణేష్ మండపాల వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా గణేష్ మండపాల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఇలాంటి అవాంచనీయ సంఘటనల చోటు చేసుకోకుండా ఎస్సై అంజమ్మ ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా గణనాథులను శోభాయమానంగా గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీగా వెళ్లి గ్రామ సమీపంలోని పెద్దవాగులో నిమజ్జనాన్ని నిర్వహించారు.

● ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

బోథ్: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి గణేష్ శోభయాత్ర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు పలు రకాల వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పించారు.


బోథ్‌లో కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ మహిళలు


సిరికొండలో చిన్నారులకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం


తలమడుగులోవినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

అనంతరం భక్తిశ్రద్ధలతో గీతాలు ఆలపిస్తూ వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిరికొండ రూరల్: నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథులు ఆది వారం నిమజ్జనానికి బయలుదెరారు. గణనాథుల కోసం ప్రత్యేక మండ పాలు ఏర్పాటుచేసి తొమ్మిది రోజుల పాటు పూజలు జరుగగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద అన్నదానం కార్యక్రమాలు చేపట్టి, చిన్నారులకు, యువతీ, యువకులకు నిర్వహించిన ఆటలపోటీల్లో భాగంగా గెలుపొందిన వారికి గ్రామస్థులు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన వేలంపాటల్లో గణనాథుని లడ్డూలను భక్తులు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా సీఐ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో డప్పు వాయిద్యాల నడుమ గణనాథులను సమీపంలోని వాగుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఒరగంటి పెంటన్న, తోకల చిన్నరాజన్న, గోర్బండ్ బాలాజీ, గొర్ల రాజన్న, బొడ్డు దత్తు, గుగ్గిళ్ల స్వామి గణేష్ మండపాల నిర్వహకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు ఆదివాసీ రాయి సెంటర్
సార్ మేడిల అత్యవసర సమావేశం

● జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 15: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనకు ఈనెల 17న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అత్యవసర ఆదివాసీ రాయి సెంటర్ సార్‌మేడిల అత్యవసర సమావేశాన్ని కేస్లాపూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆదివాసీ రాయి సెంటర్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన్నాపూర్ గ్రామ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆదివాసీ ఉద్యమ ప్రణాళికలపై చర్చించి ఉద్యమ ప్రణాళికలో భాగంగా గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ ఆధ్వర్యంలో కేస్లాపూర్ గ్రామ పటేల్ మెస్రం వెంకట్‌రావు అధ్యక్షతన ఈనెల 17న జరగబోయే అత్యవసర సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాయిసెంటర్ సార్మేడీలు, ఆదివాసీ గిరిజన గ్రామ పటేళ్ళు, ఆదివాసీ సంఘాల నాయకులు, 9 తెగల పెద్దలందరూ పాల్గొనాలని కోరారు. ఆదివాసీ మహిళపై జరిగిన ఘటనపై తమ యొక్క జాతి ఐక్యత కోసం సలహా సూచనలు, అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని కోరారు. 17న నిర్వహించే సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయి సెంటర్ గిన్నెరా సార్‌మేడి తుమ్రం జుగాదిరావు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, కోలాం సేవా సంఘం మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టేకం భాస్కర్, తుడుం దెబ్బ, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, నాయకులు టేకం భీంరావు, ఆర్క కమ్ము, కనక తుకారం, కోట్నాక్ బారిక్‌రావు, వెట్టి మనోజ్, టేకం వసంత్‌రావు,చకోవా రాజేశ్వర్, టేకం మారుతి, కుమ్ర కేశవ్‌రావు, కనక హన్మంత్‌రావు, తొడసం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

గుడిహత్నూర్, సెప్టెంబరు 15: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ముందర సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ జెండా ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ సంగ్రామంలో భూమి కోసం, భుక్తి కోసం, మాతృ దేశ విముక్తి కోసం పోరాటాలు చేసి అమరులైన వారి సేవలు మరువలేనివని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు గజంగుల రాజు, సీపీఐ మండల నాయకులు ఉస్మాన్, కుశల్, శ్రీఖర్, జమీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.





గడ్డెన్నవాగు ప్రాజెక్టులో గణనాథులను నిమజ్జనం చేస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ జానకీ షర్మిల





- బైంసాలో వైభవంగా గణనాథుల నిమజ్జనోత్సవం
- ఉప్పొంగిన ఉత్సాహం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిన పోలీసు శాఖ

మనసారా కొలిచి..

గంగమ్మ ఒడికి చేర్చి

భైంసా, సెప్టెంబరు 15: డప్పుల మోతలు, డీజే పాటలు, యువతీ, యువకుల నృత్యాలు, మహిళల కోలాటాలు వెరసి ఆదివారం భైంసా పట్టణంలోని ఏ వీధి చూసినా సందడే. అన్ని దారుల్లోనూ కోలాహలమే. మండపాల్లో తొమ్మిది రోజులపాటు పూజించిన గణనాథులను భక్తులు గంగమ్మఒడికి వైభవంగా తరలించారు. భక్తుల కోలహాలం మధ్య పూజలందుకున్న వినాయక విగ్రహాలకు ఉదయం వేళలో మండపాల్లో మండలిల సభ్యులు ప్రత్యేకపూజలు నిర్వహించి శోభయాత్రకు తరలించారు. పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీ మున్నూరుకాపు సంఘం, గోపాలకృష్ణ మందిర్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ఆర్‌డీవో కోమల్‌రెడ్డి, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్‌లతోపాటు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవ శోభయాత్రను ప్రారంభించారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పలు కాలనీల నుంచి వినాయక విగ్రహాలకు నిమజ్జనం నిర్వహించారు. వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవశోభాయాత్ర భక్తుల కోలహాలం మధ్య ఆద్యాంతం ఉత్సాహభరితంగా కొనసాగింది.



- గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

వినాయక విగ్రహాల ముందు ఆయా మండలిల సభ్యులు నృత్యాలు చేస్తూ, మహిళలు కోలాటాలు వేస్తూ శోభాయాత్రకు వన్నె తెచ్చారు. ప్రధానంగా పలు మండలిల మహిళలు తలపాగాలు ధరించి కోలాటాలు వేస్తూ శోభాయాత్రకు వన్నె తెచ్చారు. ఇక కొన్ని మండళ్ల సభ్యులు సంప్రదాయబద్ధంగా నిమజ్జనోత్సవ ప్రక్రియను చేపట్టారు. కొన్ని సంఘాలు ఎడ్లబండ్లు, తోపుడు బండ్లపై గణనాథులను నిమజ్జనానికి తరలించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఇక్కడి నిమజ్జనోత్సవ శోభాయాత్రలో పాల్గొనేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన శోభాయాత్ర అర్ధరాత్రి వరకు కొనసాగుతూనే ఉంది.

● శోభాయాత్ర మార్గాల్లో భారీగా అన్నదానాలు

పట్టణంలో ఆదివారం జరిగిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ సంఘాలు, వ్యాపార సంస్థలు, కుల సంఘాలు, మండలీలు భారీగా అన్నదానాలు, ప్రసాదవితరణలు చేపట్టాయి. శోభాయాత్ర కొనసాగే మార్గాలన్నింటిలోనూ ప్రసాదాల వితరణలు, అన్నదానాలు జోరుగా కొనసాగాయి. పలు సంఘాలు నీటి పాకెట్ల పంపిణీ చేపట్టగా సాయంత్రం వేళలో మరికొన్ని సంఘాలు భక్తులతోపాటు గణేష్ మండలీల సభ్యులకు అల్పాహారాలను సైతం అందించారు.

● భారీ పోలీసు బందోబస్తు

సమస్యాత్మక ప్రాంతంగా పేరొందిన భైంసా పట్టణ పరిధిలో గణనాథుల నిమజ్జనోత్సవ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావీయకుండా ఉండేందుకు పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది.

జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలోనే మకాం వేసి నిమజ్జనోత్సవ బందోబస్తును పర్యవేక్షించింది. ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి భద్రతాచర్యలు చేపట్టారు. గతంలో జరిగిన, ఇటీవలచోటుచేసుకున్న పలుఘటనలు దృష్టిలో పెట్టుకొని పోలీసుశాఖ వినాయక నవరాత్రి వేడుకలపై ఆద్యాంతం అప్రమత్తంగా వ్యవహరించింది. నిమజ్జనోత్సవంలో డ్రోన్ కెమెరాలను వినియోగించారు. పట్టణపరిధిలో 170సీసీకెమెరాలు ఉండగా అదనంగా మరో 50సీసీ కెమెరాలను ఏర్పాటుచేసిన శోభాయాత్రపై డేగ కన్ను దృష్టి సారించారు. పట్టణాన్ని 7సెక్టార్లుగా విభజించి ప్రణాళికబద్ధమైన భద్రతా చర్యలు చేపట్టారు. 300మందికి పైగా ట్రేయిన్ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాలతోపాటు ప్రార్థన మందిరాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాల ద్వారా భద్రతా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ జానకీషర్మిల ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ రాజారెడ్డిలు భద్రతా చర్యలను పర్యవేక్షించారు.



- బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల



క్రర వినాయకుడి శోభాయాత్రలో కోలాటాలతో వెళ్తున్న దృశ్యం

ఘనంగా గణనాథుల నిమజ్జనోత్సవం

- నిర్మల్‌లో 9వ రోజు పలు గణపతుల నిమజ్జనం
- వేలం పాటలో లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న దంపతులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 15: వినాయక నవరాత్రిఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు ఆదివారం గణనాథుల నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వివిధ కాలనీల్లో ప్రతిష్ఠించిన గణపతులను బాజాభజంత్రీల నడుమ శోభాయాత్రతో ఊరేగింపు నిర్వహించి బంగల్‌పేట్‌లో గల వినాయక సాగర్‌లో నిమజ్జనం చేశారు. అంతకుముందు పలు మండపాల్లో నిర్వహించిన లడ్డు వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా క్రర వినాయకుడికి నిమజ్జన శోభాయాత్ర

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో క్రర పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన క్రర వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఇందులో పట్టణ క్రర పారిశ్రామిక సంఘం గౌరవ అధ్యక్షుడు అక్కలపెల్లి నరేష్, పట్టణ అధ్యక్షుడు చిలమంతుల రాజలింగం, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు సాయినాథ్, కోశాధికారి పాంచాల్ గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్‌లో వినాయకుల నిమజ్జనం

కుభీర్: మండలంలోని పార్డి(బి), చొండి, పల్సి గ్రామాల్లో ఆదివారం వినాయకుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆయా మండపాల నిర్వాహకుల ఆధ్వర్యంలో 9రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాల్లో ఉంచి గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్రలో యువకులు, చిన్నారులు, గ్రామస్తులు ఉత్సాంగా పాల్గొని నృత్యాలు చేశారు. పార్డి(బి)లో ప్రతిష్ఠించిన క్రర వినాయకుని శోభాయాత్రలో గ్రామస్తులు నృత్యాలు చేశారు. అనంతరం గ్రామసమీపంలోని వాగులు, చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనంచేశారు.

కమల్‌కోట్‌లో నటి ప్రియాంక శర్మ సందడి

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో యూనిటెడ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రతిష్ఠాపించిన వినాయమకుడిని నటి ప్రియాంకశర్మ దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. కాగా ప్రియాంక శర్మసవారీ, పెళ్లికాని ప్రసాద్ తదితర సినిమాల్లో నటించారు. సినీ ఆర్టిస్ట్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మనం ఏస్థాయికి ఎదిగిన కన్న ఊరుకు ఏదోచేయాలని తపన ఉంటుందని, అందులో భాగంగానే పలు సినిమాలు తమ గ్రామంలో తీశామని చెప్పారు. మున్ముందు సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.



గణపతిని దర్శించుకున్న ప్రియాంక శర్మ, ఆర్టిస్ట్ సుధీర్



విద్యుత్ పునరుద్ధరణకు వాగులోకి దిగిన విద్యుత్ సిబ్బంది

ప్రాణాలకు తెగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

కుభీర్, సెప్టెంబరు 15: మండలంలోని నిగ్వా-మోల సుద్దవాగులో మోల గ్రామానికి చెందిన 11కేవీ విద్యుత్ వయర్ తెగి పడిపోవడంతో గ్రామానికి విద్యుత్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎల్ఎం యాషీన్, యోగేశ్వర్, ఏఎల్‌మ్ హన్మండ్లులు నీటిలోకి దిగి ప్రాణాలకు తెగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన వారిని గ్రామస్థులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ లైన్ పాతదని, ఇది ఇలాగే ఉంటే ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని, ఈ లైన్‌ను మాలేగాం నుంచి బైరోడ్డు ద్వారా వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

సోన్, సెప్టెంబరు15: మండలంలోని మాదాపూర్, పాక్‌పట్ల, గాంధీనగర్ గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో రాచకొండసాగర్, మార గంగారెడ్డి, మేకల అశోక్, ముత్యం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఉదయ్, నాగరాజు, నరేందర్, సొన్నపేట గంగారెడ్డి, మల్లేష్, తదితరులు ఉన్నారు.

చిన్నారి మహాస్యకు నంది అవార్డు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 15: నిర్మల్ జిల్లాకు చెందిన చిన్నారి మహాస్య ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాజ భవనంలో నంది అవార్డు అందుకుంది. ఆమె నృత్య ప్రదర్శన ఆహుతులను అమితంగా అలరించింది. మహాస్య తండ్రి నాంపల్లి చందన గణేష్ నిర్మల్ డీసీసీ బ్యాంక్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. చిన్నారి మహాస్యను పలువురు అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు





బేస్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు

నిర్మల్‌అర్బన్, సెప్టెంబరు15: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ బాల బాలికల బేస్ బాల్ టోర్నమెంట్ ఛాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్ల క్రిడాకారులను, సంబంధిత కోచ్, పీడీ, పీఈటీలకు మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో బాలికల జట్టు (నిజామాబాద్), బాలుర జట్టు (హైదరాబాద్), ద్వితీయ స్థానంలో బాలికల జట్టు (నల్లగొండ), బాలుర జట్టు (రంగారెడ్డి), తృతీయ స్థానంలో బాలుర జట్టు (నిజామాబాద్), బాలికల జట్టు (రంగారెడ్డి) విజేతలుగా నిలిచి జట్లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. బహుమతులు ప్రదానం చేశారు. జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులను అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ గంగాధర్, బేస్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ శ్వేత, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న చైర్మన్ ఈశ్వర్

మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహ ఆవిష్కరణ

నిర్మల్‌కల్చరల్, సెప్టెంబరు15: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఖైన్‌గేట్ ప్రాంతంలో ఆదివారం భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఈ రాజేందర్‌రావు, టీఎన్జీవో అధ్యక్షుడు ప్రభాకర్, పలువురు ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.



కాల్వ లక్ష్మీ నరసింహస్వామి మూర్తి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

దిలావర్‌పూర్, సెప్టెంబరు 15: మండలంలోని ప్రసిద్ధ పురాతన దేవస్థానం శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి (అడ్మినిస్ట్రేటివ్) ఎన్.రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న న్యాయమూర్తి దంపతులు ప్రత్యేక పూజలుచేశారు. దేవస్థానం చైర్మన్ ఉజరం మహేష్ ఆలయ విశిష్టతను న్యాయమూర్తికి వివరించారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ అర్చకులు రాము, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన డ్రైవర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు15: హైదరాబాద్ నుంచి నిర్మల్ వస్తున్న ప్రయాణికురాలు ఆర్టీసీ బస్సులో మొబైల్ ఫోన్ మరచి ఆదిలాబాద్ వెళ్లింది. డ్రైవర్ మోహినుద్దీన్‌కు బస్సులో ఫోన్ కనిపించగా బాధితురాలికి ఫోన్ చేసి పిలిచించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ సమక్షంలో ఫోన్ అందజేశారు. డ్రైవర్ నిజాయితీని డిపో మేనేజర్ ప్రతిమా రెడ్డి అభినందించారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసా రూరల్, సెప్టెంబరు15: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఎర్రన్న ఉరివేసుకుని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేగాం గ్రామానికి చెందిన ఎర్రన్న మద్యానికి బానిసై ఎటువంటి పనీ పాట లేకుండా ఇంటివాళ్లతో గొడవపడేవాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కుంటాల, సెప్టెంబరు15: మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. మండలం నలుమూలల నుంచే కాకుండా పక్క మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్రర వినాయకుడి దర్శనానికి భారీగా భక్తులు

తానూర్, సెప్టెంబరు 15: మండలంలోని భోసి గ్రామంలోని మహాదేవుని ఆలయంలో ప్రతిష్ఠించిన క్రరవరసిద్ధి వినాయకునికి ఆదివారం భారీగా భక్తులు వచ్చి దర్శించుకున్నారు. 9వ రోజు కావడంతో భక్తులుభారీగా వచ్చి దర్శించుకున్నారు. 61 సంవత్సరాల నుండి భోసి గ్రామంలో ఒకే క్రర వినాయకున్ని ప్రతిష్ఠించి పూజలు చేయడంతో భోసి గ్రామ ప్రజలు పర్యావరణ పరిరక్షకులుగా నిలుస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లా వ్యాప్తంగా వచ్చే భక్తులు, పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక భక్తులు అంటున్నారు. ఇలాంటి గ్రామ ప్రజలను ఆదర్శంగా తీసుకొని ఒకే గ్రామం ఒకే వినాయకుడు అనే నినాదంతో, రసాయనాలతో తయారు చేసిన గణపతులకంటే, క్రర వినాయకున్ని ప్రతిష్ఠించి పూజలు చేయడం వల్ల చెరువుల్లో, నదుల్లో నీటి కాలుష్యం కాకుండా ఉంటుందని అన్నారు. భోసి గ్రామానికి ఆదర్శంగా తీసుకొని ప్రతీ గ్రామంలో క్రర గణపతి, మట్టి గణపతి ప్రతిష్ఠించి పూజించాలని కోరుతున్నారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



వినాయకుని దర్శనానికి తరలి వస్తున్న భారీ భక్తజనం